తల్లికి వందనం డబ్బు పడేదెన్నడో?


- నేటికీ కార్యాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు
- పట్టించుకోని అధికారులు



మడకశిరరూరల్: 'తల్లికి వందనం' జాబితాలో తప్పుడు డేటా కారణంగా పలువురు ఈ పథకానికి దూరమయ్యారు. భూమి లేకున్నా ఉన్నట్లు, ఒక్కరికే రెండు మూడు విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు, అధిక యూనిట్లు వాడినట్లు, ఫోర్ వీలర్ ఉన్నట్టు జాబితాలో రావడంతో వారు పథకానికి అనర్హులయ్యారు. మరోవైపు సరైన ధ్రువపత్రాలు సమర్పించలేదని కొందరికి పథకాన్ని నిలిపివేశారు. అయితే అర్హుల జాబితాలో ఉండి కూడా చాలా మందికి డబ్బులు పడలేదు. వారంతా నేటికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

మడకశిర మండలంలో 193 మందికి...

కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలును చేశామని గొప్పగా చెప్పుకుంటున్నా.. నేటికీ చాలా మంది అర్హులకు సైతం డబ్బులు పడలేదు. తమ బ్యాంకు ఖాతాలో డబ్బు జమ కాలేదని పిల్లల తల్లిదండ్రులు గ్రామ సచివాలయం, ఎమ్మార్సీ కార్యాలయం చుట్టూ తిరుగుతూన్నారు. పిల్లలకు తల్లికి వందనం డబ్బులు పడలేదని సచివాలయంలో గత నెలలోనే దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకూ బ్యాంకు ఖాతాలోకి జమ కాలేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ముగ్గురు పిల్లలున్నా ఒకరికి మాత్రమే తల్లికి వందనం డబ్బులు పడిందని మిగిలిన ఇద్దరు పిల్లలకు ఇప్పటి వరకు డబ్బులు పడలేదని ఎం రంగాపురం గ్రామానికి చెందిన అశ్వర్థనారాయణ వాపోతున్నారు. అదే విధంగా ముగ్గురు పిల్లలు చదువుకుంటున్నా ఒకరికి మాత్రమే తల్లికి వందనం పడిందని ఇద్దరికి ఇప్పటి వరకు పడలేదని జక్కేపల్లి గ్రామానికి చెందిన సిద్ధగంగప్ప ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మడకశిర మండలంలో దాదాపు 193 మందికి, అమరాపురం మండలంలో 115 మందికి, రొళ్ల మండలంలో 262 మందికి విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు తల్లుల ఖాతాల్లోకి జమ కాలేదు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఎంఈఓ భాస్కర్ తెలిపారు.



మణూరు సచివాలయంలో దరఖాస్తు చేసిన అశ్వర్థనారాయణ

ఇప్పటికీ డబ్బులు పడలేదు



నా ఇద్దరు కుమారులు అభిలాష్‌యాదవ్, అభిషేక్‌యాదవ్ ఇద్దరు ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి, రమ్యశ్రీ ఇంటర్ చదువుతున్నారు. అభిలాష్ యాదవ్‌కు మాత్రం తల్లికి వందనం డబ్బులు పడ్డాయి. మిగిలిన ఇద్దరికీ ఇప్పటి దాకా డబ్బులు పడలేదు. మెళవాయి గ్రామ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేశాం. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం రాలేదు. ప్రభుత్వం చర్యలు తీసుకుని తల్లికి వందనం డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి.

– సిద్ధగంగప్ప, జక్కేపల్లి గ్రామం, మడకశిర మండలం

ఒక్కరికే డబ్బులు జమ అయ్యాయి



మండలంలోని మణూరు ప్రభుత్వ పాఠశాలలో నా ముగ్గురు పిల్లలు చదువున్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థిని పుష్పకు మాత్రమే తల్లికి వందనం పడింది. 3వ తరగతి చదువుతున్న మధు, 4వ తరగతి చదువుతున్న రామకృష్ణకు ఇప్పటి వరకూ తల్లికి వందనం డబ్బులు జమకాలేదు. మణూరు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేశాను. జాబితాలో ఉందని చెబుతున్నారు. ఎమ్మార్సీ కార్యాలయం, గ్రామ సచివాలయం చుట్టూ తిరిగినా డబ్బులు మాత్రం పడలేదు.

– అశ్వర్థనారాయణ, ఎం రంగాపురం, మడకశిర మండలం

తూతూ మంత్రంగా మండల మీట్





సమావేశానికి హజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరత్నమ్మ

లేపాక్షి: లేపాక్షిలోని వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల మీట్‌లో అభివృద్ధి పనులపై చర్చించి వాటిని ప్రాధాన్యత క్రమంలో ఎలా అమలు చేయాలి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు చర్చించాల్సి ఉంది. అయితే సుమారు 20 శాఖల అధికారులు కూడా అభివృద్ధి పనులపై చర్చించాల్సి ఉండగా అందులో విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, వ్యవసాయం, రెవెన్యూ, వెలుగు శాఖలకు సంబంధించిన అధికారులు మాత్రమే మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. కొన్ని శాఖల అధికారులకు అవకాశం ఇవ్వక పోగా మరికొన్ని శాఖల అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టారు. శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షత వహించారు. ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభం కాగా కేవలం 40 నిముషాల్లో ముగించేశారు. మండల పరిషత్ జనరల్ నిధులు రూ. 92 లక్షలు ఉండగా ఆ నిధులపై చర్చించకుండానే సమావేశాన్ని ముగించేయడంపై కొందరు ఎంపీటీసీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కోడిపల్లి, పులమతి, కల్లూరు సర్పంచులు మంజునాథ్, అశ్వర్థనారాయణ, వసుంధర మాట్లాడుతూ తల్లికి వందనం కింద కొందరికి రూ.5 వేలు, రూ.9 వేలు ఖాతాల్లోకి జమ అయ్యాయన్నారు. చెప్పిన విధంగా రూ.13 వేలు జమచేయకపోవడం సరికాదన్నారు. అలాగే యూరియా కొరత తీవ్రంగా ఉందని, కొందరికి మాత్రం ఐదారు బ్యాగ్‌లు పంపిణీ చేశారని, మిగిలిన రైతులకు ఒక్కో బ్యాగ్ యూరియా సరఫరా చేశారన్నారు. ఇలా ఎందుకు చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపిపిలు అంజనరెడ్డి, లీలావతి, కోఆప్షన్ సభ్యులు బషీర్, ఎంపీడీఓ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం

- అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు



పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ పెనుకొండ నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు దక్కింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. యువజన విభాగం అధ్యక్షుడిగా సల్లా సూర్యప్రకాశ్‌రెడ్డి, మహిళా విభాగానికి గాజుల నాగమణి, రైతు విభాగానికి గంగిరెడ్డి, బీసీ సెల్‌కు బోయ శ్రీనివాసులు, ఎస్సీ సెల్‌కు మాదిగ నాగేంద్ర, ఎస్టీ సెల్‌కు శంకర్ నాయక్‌ను ఎంపిక చేశారు. అలాగే మైనార్టీ సెల్‌కు కే.రఫిక్‌ఖాన్, క్రిస్టియన్ మైనార్టీ విభాగానికి ప్రణీత్ (చంటి), పంచాయతీరాజ్ విభాగానికి లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్టీఐ వింగ్‌కు పూలేరు సురేష్, వలంటీర్ల విభాగానికి కురుబ సునీల్‌కుమార్, మున్సిపల్ వింగ్‌కు బోయ రామస్వామి, గ్రీవెన్స్ సెల్‌కు దేశాయి రవీంద్రరెడ్డి, వాణిజ్య విభాగానికి మారుతీరెడ్డి, వీవర్స్ విభాగానికి డీసీ అశోక్‌కుమార్‌ను నియమించారు. వైఎస్సార్‌టీయూసీకి కలిగిరి అంజనరెడ్డి, లీగల్ సెల్‌కు విశ్వనాథ్‌నాయక్, మీడియా వింగ్‌కు అశోక్‌రెడ్డి, ఐటీ వింగ్‌కు ముకుందరెడ్డి, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్‌కు ఆంజనేయులు, బూత్ కమిటీ వింగ్‌కు ఇమామ్ వలి, దివ్యాంగుల విభాగానికి బోయ చెన్నకేశవులు, అంగన్‌వాడీల విభాగానికి బోయ ప్రమీల, కల్చరల్ విభాగానికి శ్రీదేవి, ఇంటలెక్చువల్ ఫోరంకు గోపాల్‌రెడ్డి, డాక్టర్స్ విభాగానికి మాగేచెరువు డాక్టర్ బాబు, పబ్లిసిటీ వింగ్‌కు అశ్వర్థరెడ్డిలను ఎంపిక చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, ఎంపికకు సహకరించిన మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కు ఆయా విభాగాలకు ఎంపిక నాయకులు వేర్వేరుగా ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. పెనుకొండ నియోజకవర్గంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

రొద్దం మండల కమిటీ నియామకం

రొద్దం: వైఎస్సార్‌సీపీ రొద్దం మండల పార్టీ కమిటీని నియమిస్తూ శుక్రవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. మండల ఉపాధ్యక్షుడిగా కేవై లక్ష్మీనారాయణరెడ్డి, హెచ్ నాగేంద్ర, జనరల్ సెక్రటరీలుగా బి.వినయ్‌కుమార్‌రెడ్డి, జీకే శ్రీనివాసులు, డీ గోపాల్, హెచ్ చిన్న, జి.ప్రసాద్‌రెడ్డి, సెక్రటరీలుగా బి.క్రిష్టప్ప, జె రవీంద్ర, బి.జయరామిరెడ్డి, హెచ్ గంగాధర్ లను ఎంపిక చేశారు. ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా కె.శ్రీనివాసులు, కే.యల్లప్ప, ఎం మనేంద్రరెడ్డి, వి.నరసింహులు, యూ వెంకటేష్, జి. క్రిష్టప్ప, వాల్మీకి ఓబులేసు, ఎస్‌జీ కదిరప్ప, కే.క్రిష్టపంప, సనావుల్లా, ఎం బైలాంజినేయులు, ఎంఆర్ గోపాల్, జె. శ్రీనివాస్‌రెడ్డి, వైటీ హరినాథ్ రెడ్డి, బి.రామచంద్రారెడ్డి, బి.క్రిష్ణమూర్తి, సి.సోమశేఖర్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, టి.శేషగిరి, జి.నరసింహమూర్తి, వడ్డి రామాంజి, జి.నరసింహారెడ్డి, కుల్లాయప్ప, రాజు, బీకే రామాంజినేయులు, పి.శివన్న, కే శంకర్‌రెడ్డి, వి. వేంకటేసులు, కే.రామచంద్రారెడ్డి, ఎ.ఈశ్వర్, టి.శ్రీధర్‌రెడ్డి, బి.హనుమతరెడ్డి, బి.దనుంజయ, కే.సత్యనారాయణరెడ్డి, ఎస్ రమేష్, బి.శ్రీనివాస్‌రెడ్డి, యు.వెంకటేశ్వర్లు,కే.నాగరాజు, వి.శంకరనారాయణరెడ్డి, జీఎస్ వేణుగోపాల్, ఆర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్ సుబ్రహ్మణంరెడ్డి, బి.సురేష్, యుపీ నరసింహమూర్తి, పి.విశ్వనాథ్ రెడ్డి, కే.గోపాల్‌రెడ్డి, ఏ.శంకర్‌రెడ్డి, కసప్ప, జి.రవి, బి.గోపి, టీసీ సురేష్, జి.మల్లికార్జున, ఎల్ శంకర్ రెడ్డి, బి.రామాంజి, చాకలి బాబు, తిప్పారెడ్డి, బి.జి.శ్రీనివాసులు, శశికుమార్, చాకిల గోవిందులను ఎంపిక చేశారు.

'ఆల్ ఇండియా స్టూడెంట్స్' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శివకుమార్

రొద్దం: ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి రొద్దం మండలం గొబ్బరంపల్లికి చెందిన శివకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఆధ్వర్యంలో విజయవాడ కేంద్రంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ కార్యక్రమంలో భాగంగా తనను ఎన్నుకొన్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



సోమందేపల్లిలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు



మడకశిర: రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న టీచర్లు

మడకశిర/సోమందేపల్లి/రొళ్ల/పెనుకొండరూరల్/గుడిబండ: కూటమి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పెనుకొండ, సోమందేపల్లి, మడకశిర, రొళ్ల, గుడిబండ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలియజేశారు. ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు.

క్లుప్తంగా

చెట్టును ఢీకొన్న బైక్... ఒకరి మృతి

హిందూపురం/పరిగి: ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పరిగి మండలం కొడిగెనహళ్లికి చెందిన నాగభూషణం (50), తన సోదరుడు లక్ష్మీనారాయణతో కలసి ద్విచక్రవాహనంపై శుక్రవారం మడకశిర మండలం చందకచర్లలో తమకున్న వ్యవసాయ భూమిలో పంట సాగు చేయడానికి వెళ్లారు. పని ముగించుకుని మధ్యాహ్నం తిరుగు ప్రయాణమైన వారు కొడిగెనహళ్లి సమీపంలోకి చేరుకోగానే అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి వేగాన్ని నియంత్రించుకోలేక నేరుగా వెళ్లి చెట్టును ఢీకొన్నారు. ఘటనలో నాగభూషణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణను స్థానికులు హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య శ్యామలమ్మ ఫిర్యాదు మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్రస్థాయి నృత్య పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న అంజనప్రియ

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన విద్యార్థిని కే.అంజన ప్రియ రాష్ట్రస్థాయి నృత్య పోటీలకు ఎంపికైంది. బుక్కపట్నంలోని (డైట్) జిల్లా విద్యా శిక్షణా సంస్థలో జరిగిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్‌లో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన ముగ్గురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అందులో హిందూపురం పట్టణానికి చెందిన శ్రీశేఖర్ అకాడమికి చెందిన పదో తరగతి విద్యార్థిని అంజనప్రియ తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది.

వీధి కుక్కల పట్టివేత

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వీధి కుక్కలను కమిషనర్ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పుట్టపర్తికి చెందిన కరుణా సొసైటీ సిబ్బంది పట్టుకునే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. వారం రోజుల అనంతరం ఆపరేషన్, వాక్సినేషన్ ప్రక్రియ పూర్తి చేసి యథావిధిగా పట్టణంలో వదలడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు.


పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాట రాయుళ్లతో సీఐ రాజకుమార్

అమరాపురం: మండల పరిధిలోని కెంకెర గ్రామ చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 18,130 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ.ఇషాక్‌బాషా తెలిపారు. శుక్రవారం పేకాట శిబిరంపై మడకశిర రూరల్ సీఐ రాజకుమార్ , సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 20 మంది వరకూ పేకాట ఆడుతున్నట్లు గుర్తించామని, అయితే పది మందిని పట్టుకున్నామని, మిగతావారు పరారీలో ఉన్నారన్నారు. ఐదు ద్విచక్ర వాహనాలతో పాటు రూ.18,130 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముతవల్లి సిద్ధిక్‌సేట్ మృతి



సిద్ధిక్‌సేట్ (ఫైల్)

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని మైమెన్ మసీదు ముతవల్లి అబుబకర్ సిద్ధిక్‌సేట్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేత వేణురెడ్డి సిద్ధిక్‌సేట్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడు లతీఫ్ సేట్‌ను పరామర్శించారు. ఆయన వెంట మైనారిటీ నాయకుడు చాంద్‌బాషా ఉన్నారు.

15 నుంచి 'రణభేరి'



పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ: విద్యారంగ, ఆర్థిక, సమస్యలపై యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలో యూటీఎఫ్ పెనుకొండ జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం రణభేరి పోస్టర్‌లను విడుదల చేశారు. సమస్య పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

హిందూపురం: మండలంలోని అప్పలకుంట గ్రామంలో మృతి చెందిన గుర్తుతెలియని 50 ఏళ్ల మహిళను మృతదేహాన్ని శుక్రవారం స్వచ్ఛంద సేవకులు యుగంధర్ సన్నిహితులతో కలిసి ఖననం చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రొళ్ల: మండల పరిధిలోని ఆవినకుంట గ్రామం వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. సత్యసాయి సేవ సంస్థలు, సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా 'మానవతా విలువలతో కూడిన సత్యసాయి విద్యా విధానం' 'కర్తవ్యమే దైవం' అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. వ్యాసరచన పోటీలను ఎంఈఓ శ్రీధర్ పర్యవేక్షించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ మున్వార్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోండి

మడకశిరరూరల్: కూటమి ప్రభుత్వం ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఎస్పీ నాయకులు తెలిపారు. శుక్రవారం తాలూకా బీఎస్పీ ఇన్‌చార్జ్ ఇందివర్ నాయకులతో కలిసి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నాయకులు అంజినప్ప, రామాంజినేయులు, హనుమంతు, క్రిష్టప్ప, నాగరాజు, విజయకుమార్, శంకరప్ప, చందు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

పెనుకొండ రూరల్: సేవ్ ఆర్టీటీ.. సేవ్ పూర్ పిపుల్ కార్యక్రమంలో భాగంగా దళిత సంఘాల నాయకులు శుక్రవారం పోస్టర్లు విడుదల చేశారు. ఈ నెల 15న అనంతపురంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు జిల్లాలోని అన్ని వర్గాల వారు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎం.ఎస్ మూర్తి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు, నరసింహులు, జయశంకర్, నారాయణ, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మాశేరొప్పంలో కార్డెన్ సెర్చ్



ప్రజలకు సూచనలిస్తున్న సీఐ నగేష్

మడకశిర: ప్రజలు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మడకశిర టౌన్ సీఐ నగేష్ తెలిపారు. పట్టణ పరిధిలోని మాశేరొప్పంలో శుక్రవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామ ప్రజలతో సమావేశమై చట్టాలపై అవగాహన కల్పించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

హిందూపురం: పట్టణంలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరాఫరాలో అంతాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. శనివారము ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఆర్‌పీజీటీ రోడ్డు, బాలాజీ నగర్, హస్నాబాదు, పరిగి రోడ్డు, సప్తగిరి కాలేజీ రోడ్డు, నింకంపల్లి, మోత్కుపల్లి, శ్రీనివాస ఐటీఐ కాలేజీ ఏరియా, ద్వారకా కాలనీ, మార్కండేయనగర్, ధన్ రోడ్, భాగ్యనగర్, వెంకటేశ్వర నగర్, ముదిరెడ్డిపల్లి, మేళాపురం, చౌడేశ్వరి కాలనీ, సదాశివ నగర్, దీప్తి స్కూల్, మిలాద్ నగర్, నంజప్ప లేఔట్, అహ్మద్ నగర్, మారుతి లేఔట్, ప్రశాంత్ నగర్, హౌసింగ్ బోర్డు, టీచర్స్ కాలనీ, సడ్లపల్లి, సడ్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, ఎన్టీఆర్ కాలనీ, ఆటోనగర్, వీవర్స్ కాలనీల్లో కరెంటు ఉండదన్నారు.

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం, రొద్దం, పెద్దమంతూరు, రాగిమేకులపల్లి, దొడగట్ట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రొళ్ల: మరమ్మతుల కారణంగా రొళ్ల, వన్నారనపల్లి, హెచ్‌ఎం పల్లి, హొట్టేబెట్ట గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నిజాముద్దీన్ ప్రకటనలో తెలిపారు.

పెనుకొండ రూరల్: మరమత్తుల కారణంగా పట్టణంలోని వజ్రాలపేట, న్యూ కాలనీ, షీ ఫాం, ఎన్టీఆర్ కాలనీ, రైల్వే స్టేషన్, నాగులకట్ట, హెచ్‌ఎంటీ కాలనీ, ఫారెస్ట్ ఆఫీస్, డీఎస్పీ బంగ్లా, అంబేడ్కర్ సర్కిల్ తదితర చోట్ల శనివారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నారాయణస్వామి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ అంతరాయం ఉంటుందన్నారు.

మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేద్దాం

పెనుకొండ: దళిత బహుజనుల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుల విగ్రహాలను పెనుకొండ పట్టణంలో ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు చేపడదామని హైకోర్ట్ న్యాయవాది శివరామకృష్ణ పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రజా సంఘాల నాయకులు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సమావేశమై చర్చించారు.

కల్లు, మద్యం దుకాణాలను తొలగించండి

హిందూపురం టౌన్: చిలమత్తూరు మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నగర్‌లో నివాసాల వద్ద ఉన్న కల్లు, మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని ఎస్సీ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాన్ని అందించారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నితిన్‌రెడ్డి



మడకశిర: మడకశిర మండలం జక్కేపల్లికి చెందిన నితిన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. తొలుత నితిన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగంలో చురుగ్గా పని చేశారు. నితిన్‌రెడ్డి నియామకంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి పాటు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నితిన్‌రెడ్డి మట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథ్, ఉపాధ్యాయుడు వెంకటేష్‌ప్రసాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వారిని ప్రజలు ఘనంగా సత్కరించారు.

కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

రొద్దం: మండల పరిధిలోని కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆదర్శ ఉపాధ్యాయుడు, కవి, రచయిత జాబిలి చాంద్‌బాషాను శుక్రవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరువున ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నందుకు పాఠశాల హెచ్‌ఎం హరికిరణ్ ఆధ్వర్యంలో ఆయనకు సత్కారం జరిగింది.

అమరాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో..

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కృష్ణారెడ్డిని సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడంతో పూలు, శాలువాలతో సన్మానించారు. అదే విధంగా గురు పూజోత్సవం సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు నిర్వహించిన ఆటల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతికి సంతాపం

మడకశిర: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి ఆకస్మిక మరణం ఉమ్మడి అనంతపురం జిల్లాకు తీరని లోటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రైతు సమస్యలపై ఆయన ఎంతో శ్రద్ధ చూపేవారన్నారు. రాయలసీమ సమస్యలపై మహానేత వైఎస్సార్ చేసిన పాదయాత్రలో ఆయన పాల్గొని పోరాటం చేశారన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రవికుమార్‌కు నివాళి



రవికుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మధుమతిరెడ్డి

చిలమత్తూరు: మాజీ కౌన్సిలర్ కె.రవికుమార్‌కు చిత్రపటం వద్ద వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మధుమతిరెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం హిందూపురంలోని మృతుడు రవికుమార్ నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట లేపాక్షి వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, లైఫ్ వరల్డ్ ఉదయ్‌కుమార్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు

అమరాపురం: స్థానిక వినాయకనగర్‌లో 18 రోజులుగా పూజలందుకున్న అశ్వమేధ హిందూ గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించేందుకు వరసిద్ధి వినాయక కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి స్వామి వారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో కూర్చొబెట్టి పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

టైలరింగ్ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

మడకశిర: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టైలరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్, ఆపై చదివిన యువతీ యువకులు కోర్సుల్లో ప్రవేశానికి అర్హులన్నారు. శిక్షణ మూడు నెలలు ఉంటుందన్నారు. వివరాలకు 9703898900, 9666268262‌0 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అభాగ్యులకు చేయూత

పావగడ: పట్టణంలోని కావలగేరి వీధిలో అన్నా చెల్లెలు రామాంజనేయ, సీతా లక్ష్మిల వ్యథపై 'సాక్షి' లో గురువారం ప్రచురితమైన 'అయ్యో పాపం..'అనే కథనానికి స్పందన లభించింది. 4వ వార్డుకు చెందిన హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్ రూ.10 వేల చెక్కును బాధితులకు శుక్రవారం అందించారు.